క్లుప్తంగా

ఇళ్ల స్థలాలు కేటాయించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలంటూ సోమవారం అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కమిటీ సభ్యుడు రామాంజనేయులు మాట్లాడుతూ అద్దె ఇళ్లలో జీవితం నెట్టుకొస్తున్న నిరుపేదలకు వెంటనే ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కూటమి ప్రభుత్వం వెంటనే సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు.

అగాపే ఆశ్రమం తనిఖీ



ఆశ్రమంలో వృద్ధులతో మాట్లాడుతున్న వైద్యాధికారి సుమన్ రెడ్డి

యాడికి: మండల కేంద్రంలోని అగాపే వృద్ధాశ్రమాన్ని సోమవారం యాడికి వైద్యాధికారి సుమన్ రెడ్డి తనిఖీ చేశారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ప్రతిఒక్కరూ టీబీ వ్యాధి పట్ల శ్రద్ధ వహించి టీబీ రహిత భారత్‌కు సహకరించాలన్నారు. ఆసుపత్రి వైద్య సిబ్బంది నాగమణి, సునీల్ వృద్ధులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆశ్రమ యజమాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఖరగ్‌పూర్ ఐఐటీలో సీటు



పునీత్

గుంతకల్లుటౌన్: గుంతకల్లు మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో ఫిట్టర్‌గా పనిచేస్తున్న జోలాపురం కోటేశ్వరరావు(కోటీ) కుమారుడు జె.పునీత్ దేశంలోనే అత్యంత ప్రాముఖ్యత కలిగిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఖరగ్‌పూర్‌లో సీటు సాధించాడు. పదిహేను రోజుల క్రితం విడుదలైన జేఈఈ (అడ్వాన్స్) పరీక్ష ఫలితాల్లో ఓబీసీ కేటగిరిలో 578వ ర్యాంకు సాధించిన పునీత్‌కు ఖరగ్‌పూర్ ఐఐటీలోని ఈసీఈ (ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్) కోర్సులో సీటు కేటాయిస్తూ యూనివర్సిటీ ఉత్తర్వులు పంపింది. ఖరగ్‌పూర్ ఐఐటీలో సీటు లభించడం ఎంతో ఆనందంగా ఉందని, మంచి ఇంజినీర్‌గా ఎదిగి ఆ రంగంలో సేవలందించాలన్నదే తన లక్ష్యమని పునీత్ పేర్కొన్నాడు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



బయపు రెడ్డి (ఫైల్)

యాడికి: మండల కేంద్రంలోని దైవాలమడుగుకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బయపు రెడ్డి(84) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సంజీవరాయుడు, జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామి రెడ్డి, సీనియర్ నాయకులు భోగాతి బ్రహ్మానంద రెడ్డి, కొట్టే వెంకటరామి రెడ్డి, కేశవ రెడ్డి, శివ కేశవ రెడ్డి, రామకృష్ణ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి నాగేష్ , రామసుబ్బయ్య, రసీదు తదితరులు దైవాలమడుగుకు వెళ్లి మృత దేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అతడి భార్య, కుమారుడు మోహిరెడ్డిని పరామర్శించారు.

బోధనలో పోటీ.. ఫలితాల్లో మేటి

- పెద్దపప్పూరు కళాశాలలో ఏటా ఉత్తమ ఫలితాలు
- కళాశాలలో ప్రవేశానికి విద్యార్థుల ఆసక్తి



పెద్దపప్పూరు జూనియర్ కళాశాల



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న అధ్యాపకుడు

పెద్దపప్పూరు: విద్యా బోధనలో పోటీ తత్వం.. అధ్యాపకుల కృషితో ఏటా ఉత్తమ ఫలితాలు అధికారుల మన్ననలు పొందుతోంది పెద్దపప్పూరు జూనియర్ కళాశాల. ఇటీవల పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు కళాశాలలో చేరడానికి ఆసక్తి చూపుతున్నారు. కళాశాలకు సొంత భవనం లేకున్నా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల అదనపు తరగతి గదుల్లోనే జూనియర్ కళాశాలను నిర్వహించి ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. ఒకే ప్రదేశంలో కళాశాల, పాఠశాల ఉండడంతో అధిక ఫీజులు చెల్లించి ప్రైవేటు కళాశాలలో చేర్పించడంకన్నా తమ పిల్లలను అదే కళాశాలలో చేర్పిస్తే విద్యావంతులుగా ఎదుగుతారని తల్లిదండ్రులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పిస్తున్నారు. అయితే కళాశాలలో గణిత అధ్యాపకుడు పోస్టు ఖాళీగా ఉంది. ఆ పోస్టును భర్తీ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. అలాగే కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలన్నారు. గత ఏడాది ఇంటర్ ఫలితాల్లో జిల్లాలో ద్వితీయ స్థానం సాధించగా.. ఈ ఏడాది 97 శాతం ఉత్తీర్ణత సాధించిన కళాశాలను 'సాక్షి'సందర్శించి అధ్యాపకులు, స్టూడెంట్లను పలకరించింది.

మంచి ఫలితాలు సాధిస్తున్నాం



6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పాఠశాల, కళాశాల ఒకేచోట ఉండడంతో.. పదిలో ఉత్తీర్ణులైన విద్యార్థులంతా ఈ కళాశాలలోనే చేరడానికి ఇష్టపడుతున్నారు. గణితానికి సంబంధించి అధ్యాపకుడు లేకపోవడం కొరతగా ఉంది. అధ్యాపకుల ఉత్తమ బోధనతో మంచి ఫలితాలు సాధిస్తున్నాం.

–గణేష్, సెకండ్ ఇయర్

సొంత భవనం ఏర్పాటు చేయాలి



ప్రభుత్వ ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదుల్లో కొనసాగిస్తున్న కళాశాలకు ప్రభుత్వం గుర్తించి అనువైన ప్రదేశంలో కళాశాలకు సొంత భవనం నిర్మిస్తే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది. అధ్యాపకులు ప్రైవేటు కళాశాలల్లో కంటే మెరుగైన బోధన చేస్తుండంతో ఏటా ఉత్తమ ఫలితాలు వస్తున్నాయి.

–సుకన్య, సెకండ్ ఇయర్

ఏటా ఉత్తమ ఫలితాలు



ప్రైవేటు కళాశాలలకు దీటుగా ఫలితాలు సాధించాలనే పట్టుదల ప్రతి ఒక్క అధ్యాపకుడిలో ఉండడంతోనే ఏటా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాం. ఉన్నత పాఠశాల ఆవరణలోనే జూనియర్ కళాశాల ఉండడంతో.. విద్యార్థులను ఈ కళాశాలలోనే చేర్పించడానికి తల్లిదండ్రులు ఇష్టపడుతున్నారు.

–శంకర్ ప్రసాద్, ప్రిన్సిపాల్

ఆర్‌ఐగా హనుమప్రసాద్



గుత్తిరూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ)గా హనుమప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ముందుగా తహసీల్దార్ ఓబులేసును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఆయన బాధ్యతలు తీసుకున్నారు.

ఏఓగా అంజనేయులు



తాడిపత్రి రూరల్: తాడిపత్రి వ్యవసాయాధికారిగా ఆంజనేయులు బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న మహితాకిరణ్ పెద్దపప్పూరు ఏఓగా బదిలీపై వెళ్లారు. పెద్దపప్పూరు ఏఓగా పని చేస్తున్న ఆంజనేయులు బదిలీపై తాడిపత్రికి వచ్చారు.

ఏఓగా మునికృష్ణ



పెద్దవడుగూరు: మండల వ్యవసాయ అధికారిగా మునికృష్ణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న మల్లీశ్వరి అనంతపురం పీటీఎల్ (క్రిమి సంహార మందుల పరీక్ష కేంద్రం)కు బదిలీ అవగా.. గోరంట్ల నుంచి మునికృష్ణ ఇక్కడకు వచ్చారు. మండలంలోని రైతులకు అందుబాటులో ఉంటానని మునికృష్ణ అన్నారు.

శింగనమల తహసీల్దార్‌గా శేషారెడ్డి



గార్లదిన్నె (శింగనమల): శింగనమల తహసీల్దార్‌గా సోమవారం శేషారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ పుట్లూరు మండలంలో తహసీల్దార్‌గా పని చేస్తూ శింగనమల తహసీల్దార్‌గా బదిలీపై వచ్చానన్నారు.

'తల్లికి వందనం' నిధుల మళ్లింపుపై ధర్నా



ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

గుంతకల్లు రూరల్: తల్లికి వందనం పథకం నిధులను తల్లుల ఖాతాలో వేయాలేగాని, ప్రైవేటు స్కూల్స్ ఖాతాకు మళ్లించడం ఏమిటని సమాచార హక్కు చట్టం పారా లీగల్ వలంటీర్ లాలిరెడ్డి ప్రశ్నించారు. విద్యాహక్కు చట్టం ద్వారా ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఉచిత విద్యకు ఎంపికైన విద్యార్థుల తల్లులకు అందాల్సిన తల్లికి వందనం నిధులను ప్రభుత్వం నేరుగా ప్రైవేటు పాఠశాలలకు ఖాతాలకు మళ్లించింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం స్థానిక ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తల్లికి వందనం నిధులను పాఠశాలల ఖాతాల్లో వేయడం వల్ల తమ పిల్లలకు అవసరమైన పాఠ్య పుస్తకాలు, యూనిఫారమ్స్, నోటు పుస్తకాలు ఇతరత్రా విద్యాసామగ్రిని కొనడం కష్టంగా మారిందన్నారు. తల్లికి వందనం నిధులను ప్రైవేటు విద్యాసంస్థలకు చెల్లిస్తే ఇక విద్యాహక్కు చట్టం ద్వారా అడ్మిషన్ పొంది ప్రయోజనమేంటని ప్రశ్నించారు. లేనిపక్షంలో ప్రభుత్వమే విద్యార్థులకు అవసరమైన పూర్తి విద్యాసామాగ్రిని అందించే ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.

సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి



ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

గుత్తి: తల్లికి వందనంతో పాటు అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ గుత్తిలో సోమవారం మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రామాంజి, ఉపాధ్యక్షులు మహేష్ మాట్లాడారు. ఇటీవల విడుదల చేసిన తల్లికి వందనం పథకంతో పాటు కూటమి ప్రభుత్వంలో ఒక్క సంక్షేమ పథకం కూడా కార్మికులకు వర్తించ లేదన్నారు. గత ప్రభుత్వంలో అన్ని రకాల సంక్షేమ పథకాలు వర్తించాయన్నారు. ఈ ప్రభుత్వంలో ఎందుకు వర్తించవని ప్రశ్నించారు. సంక్షేమ పథకాలన్నీ తమకు వర్తింపజేయాలన్నారు. లేకపోతే జూలై నుంచి ఆందోళన కార్యక్రమాలు తీవ్రం చేస్తామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపాలిటీలోని అన్ని విభాగాల కార్మికులు పాల్గొన్నారు.

హంద్రీ-నీవా కాలువ పనులు ఆపాలి



శింగనమల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

గార్లదిన్నె(శింగనమల): ప్రభుత్వం వెంటనే హంద్రీ-నీవా కాలువ పనులు ఆపాలని అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు.సోమవారం భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో శింగనమల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈనెల 16న శింగనమల తహసీల్దార్‌కు రైతు సమస్యలపై వినతి పత్రం అందజేసినా సమస్యలు పరిష్కరించలేదన్నారు. అలాగే హంద్రీ-నీవా కాలువ లైనింగ్ పనులు ఆపి , హంద్రీ-నీవా కాలువ కాలువను పదివేలు క్యూసెక్కులతో వెడల్పు చేయాలన్నారు. హెచ్ఎల్‌సీకి సమాంతర కాలువ ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధిహామీ పథకం లో వంద రోజులు పని దినాలు కల్పించాలన్నారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ శేషారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా కమిటీ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి నాగరాజు, సహాయ కార్యదర్శి కృష్ణ, మండల కమిటీ రంగన్న, శంకరన్న, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

వంచనకు మారుపేరు చంద్రబాబు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భవానీ, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, పార్టీ శ్రేణులు

గుంతకల్లుటౌన్: మోసానికి, వంచనకు మారుపేరు చంద్రబాబు అని, మేనిఫెస్టోను పవిత్ర గ్రంధంగా భావించి ప్రజలకిచ్చిన హామీలన్నీ అమలు చేసిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటే ప్రజలకు ఎంతో నమ్మకని మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి అన్నారు. సోమవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చంద్రబాబు ఏడాది పాలనా వైఫల్యాలపై వైఎస్సార్‌సీపీ ప్రచురించిన 'జగన్ అంటే నమ్మకం..చంద్రబాబు అంటే మోసం' అనే పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు. నైరుతిరెడ్డి మాట్లాడుతూ సూపర్‌సిక్స్‌తో పాటు అనేక వాగ్దానాలతో గద్దెనెక్కిన చంద్రబాబు ఏడాది పాలనంతా ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు, ఆడపిల్లలపై అఘాయిత్యాలు, అరాచకాలు తప్ప ప్రజలకు మంచి చేసేందేమీ లేదన్నారు. రాష్ట్రంలో నవ్వినా..తుమ్మినా.. దగ్గినా కేసులు పెట్టే దుస్థితి దాపురించిందన్నారు. చంద్రబాబు అంటేనే మోసానికి, వంచనకు మారుపేరని ఆమె ధ్వజమెత్తారు. అన్యాయపు పాలనా ఎక్కువ రోజులు సాగదని, ప్రజలు ఈ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని ఆమె హెచ్చరించారు. స్థానిక అధికార పార్టీ ప్రజాప్రతినిధులు నియోజకవర్గ ప్రజల సమస్యలను గాలికొదిలేశారని ఆమె ఆరోపించారు. వైటీ చెరువులో ఓవర్‌హెడ్ ట్యాంక్ కూలేందుకు సిద్ధంగా ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ రామాంజినేయులు, కౌన్సిలర్లు నీలావతి, లింగన్న, సుమోబాషా, మాజీ కౌన్సిలర్ బీటీ లక్ష్మిదేవి, పార్టీ సీనియర్ నేతలు యుగంధర్‌రెడ్డి, మల్లికార్జున శాస్త్రి, మాబు, నూర్, ఆరీఫ్, బావన్న, పార్టీ జిల్లా కార్యదర్శి నాగేంద్ర, పార్టీ నియోజకవర్గం అనుబంధ విభాగాల అధ్యక్షులు రంగనాయకులు, రంగనాయకులు, నాయకులు ఆర్డీజీ.బాషా, బాబూరావు, గోవింద్‌నాయక్, జయరామిరెడ్డి, బికె.రంగా,తిమ్మప్ప, కరీమ్, షాబుద్దీన్, మహదేవ్, వీరన్న, వసంత్, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గుంతకల్లు: అన్నదమ్ముల మధ్య నెలకొన్న ఆస్తి తగదా వివాదంలో ఓ మహిళ ఆత్మహత్యకు యతి ్నంచిన సంఘటన సోమవారం చేటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పాత గుంతకల్లులో మస్తానయ్య దర్గా వద్దే జంబులింగ, భార్య పద్మావతి ఉంటున్నారు. జంబులింగకు ఇద్దరు తమ్ముళ్లు. ఆస్తి పంపకాల్లో చెరో ఇల్లు వచ్చాయి. అయితే చిన్న తమ్ముడు మస్తాన్ తన అన్నకు తెలియకుండా బ్యాంకులో ఇళ్లను తాకట్టుపెట్టి లోన్ తీసుకున్నాడు. తీసుకున్న లోన్ చెల్లించకోపోవడంతో బ్యాంకు అధికారులు జంబులింగ ఇంటి వద్దకు రికవరీ కోసం తరుచూ వచ్చేవారు. ఈ విషయమై తమ్ముడు మస్తాన్‌ను జంబులింగ దంపతులు ప్రశ్నించగా సొమ్ము కట్టేది లేదు..మీ ఇష్టం వచ్చింది చేసుకోండి అంటూ ఎదురుతిరిగాడు. దీంతో మనస్తాపం చెందిన పద్మావతి అందరూ ఉండగానే బెడ్ రూమ్ తలుపులు వేసుకుని ఫ్యాన్‌కు ఉరేసుకుంది. అప్రమత్తమైన బంధువులు తలుపులు పగలుగొట్టి ఆమెను రక్షించి వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించడంతో పద్మావతికి ప్రాణాపాయం తప్పింది. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

స్కేటింగ్‌లో చిన్నారికి గోల్డ్‌మెడల్



సోనాక్షి

బుక్కరాయసముద్రం: బీకేఎస్ మండల కేంద్రానికి చెందిన ఓ చిన్నారి స్కేటింగ్‌లో బంగారు పతకం సాధించింది. వివరాలు.. బీకేఎస్ మండల కేంద్రంలోని వేణుగోపాల్, మౌనికల కుమార్తె సోనాక్షి జూన్ 12 నుంచి 14వ తేదీ వరకు తిరుపతిలో స్టేట్ జోనల్ ర్యాకింగ్ ఓవరాల్ చాంపియన్ షిప్- పోటీల్లో రింక్-4, రింక్-5 విభాగంలో బ్రాంజ్, గోల్డ్ మెడల్ సాధించింది. ప్రతిభ కనబరిచిన చిన్నారిని కోచ్‌లు హేమంత్, అఖిల్, ఆనంద్, తల్లిదండ్రులు అభినందించారు.

'కూటమి' వైఫల్యంపై పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

గుంతకల్లుటౌన్: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ ఏడాది పాలనంతా కార్పొరేట్లకు రెడ్‌కార్పెట్ పరచడమే తప్ప పేద ప్రజలకు చేసింది శూన్యమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతి విమర్శించారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ ఏడాది పాలనా విధానాలను వ్యతిరేకిస్తూ ఆ పార్టీ ప్రచురించిన 'దారి తప్పుతున్న టీడీపీ కూటమి ఏడాది పాలన' అనే పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు. సూపర్‌సిక్స్ హామీలతో గద్దెనెక్కి వాటిని అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని వారు దుయ్యబట్టారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు డి.శ్రీనివాస్, తిమ్మప్ప, సురేంద్ర, రంగమ్మ పాల్గొన్నారు.

యోగా, ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా చేస్తున్న జైలు సూపరింటెండెంట్ రహ్మాన్, డీఎంహెచ్ఓ డాక్టర్ దేవి, ఖైదీలు

బుక్కరాయసముద్రం/పామిడి: ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ యోగాసనాలు వేయాలని జిల్లా జైలు సూపరింటెండెంట్ రహ్మాన్ సూచించారు. సోమవారం మండలంలోని రెడ్డిపల్లి వద్ద ఉన్న జిల్లా జైల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ దేవి, వసంత్‌కుమార్, నాగరాజ్, హరీష్, చంద్రమోహన్, రవి కుమార్, అయుష్ డాక్టర్ లాల్యా నాయక్, డాక్టర్ రామ్‌కుమార్, హెచ్ఈఓ డాక్టర్ త్యాగరాజ్, హెచ్ఈఓ గంగాధర్, వివేకానంద యోగా కేంద్రం ప్రతినిధి రాజశేఖర్‌రెడ్డి, ఈసా ఫౌండేషన్ ప్రతినిధి ఆదిత్య తదితరులు పాల్గొన్నారు. అలాగే బీకేఎస్ మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ విభాగాల ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ విభాగం అధిపతి డాక్టర్ లక్ష్మి నారాయణ, ఎన్‌సీసీ విభాగం అధిపతి సుస్మిత, హరిక్రిష్ణ, ఎమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ అధిపతి డాక్టర్ వినీత, యోగా గురువు నాగరాజు విద్యార్థులు పాల్గొన్నారు.

పామిడి పట్టణంలోని టీసీ హైస్కూల్‌లో సోమవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందస్తు సన్నాహాల్లో భాగంగా విద్యార్థులు యోగాసనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆయూష్ వైద్యురాలు కృష్ణవేణి యోగా ఫ్యాకల్టీ సంధ్యాదత్త్ , హెచ్ఎం రామ్‌కుమార్, ఎన్‌సీసీ యూనిట్ అధికారి రామాంజనేయులు, ఎన్‌సీసీ అభ్యాసక విద్యార్థులు పాల్గొన్నారు.

5 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గార్లదిన్నె: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు పోలీసులు సోమవారం తెలిపారు. మండలంలోని కల్లూరు సమీపంలోని పెన్నానదిలో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు.

ఏఓ, ఈఓలకు సత్కారం

పామిడి: పామిడి నూతన ఏఓ విజయకుమార్, పంచాయతీ ఈఓ అశ్వర్థ నాయుడును సోమవారం ఆయా కార్యాలయ సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయా నూతన అధికారులకు శాలువాలు కప్పి, పూలమాలలతో సత్కరించారు. గతంలో ఒక్కడ ఏఓగా పని చేస్తున్న లీనా వసుంధర గుంతకల్లుకు బదిలీ కాగా, ఆమె స్థానంలో విజయకుమార్ గుంతకల్లు నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. అలాగే గతంలో ఇక్కడ పంచాయితీ ఈఓగా పనిచేస్తున్న గోపాల్ యాడికికి బదిలీ కాగా, అక్కడ నుంచి ఆయన స్థానంలో అశ్వర్థ నాయుడు ఇక్కడకు బదిలీపై వచ్చారు.

26న కంటి వైద్య శిబిరం

తాడిపత్రి రూరల్: పట్టణంలో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 26న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. పట్టణంలోని మొయిన్‌బజార్‌లో ఉన్న ఆర్‌వీ స్వామి కల్యాణమండపంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, బెంగళూరుకు చెందిన శంకర కంటి ఆస్పత్రి సహకారంతో పరీక్షలు జరుగనున్నాయి. కంటి పరీక్షలకు హాజరయ్యేవారు సెల్‌ఫోన్, ఆధార్‌కార్డు తెచ్చుకోవాలని నిర్వాహకులు సూచించారు.

వాహనాల తనిఖీ

గుత్తి: పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్, ప్రభుత్వాస్పత్రి ప్రాంతాల్లో సోమవారం పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జీపులు, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు తదితర వాహనాలను ఆపి తనిఖీ చేశారు. లైసెన్స్, ఆర్‌సీ, పర్మిట్లు లేని వాహన డ్రైవర్లపై జరిమానా విధించారు. కార్యక్రమంలో ఎస్ఐలు సురేష్, ఆశా బేగం, హెడ్ కానిస్టేబుల్ రమేష్ నాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

'దళితులకు భూ పంపిణీ చేయండి'

బుక్కరాయసముద్రం: మండలంలో నిరుపేద దళితులకు భూ పంపిణీ చేయాలని దళిత సంఘం నేతలు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారుఅర్హులైన నిరుపేద దళితులకు ఈ భూమిని అసైన్‌మెంట్ చట్టం ద్వారా కేటాయిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వరికూటి కాటమయ్య, బండారు మారుతి, కుళ్లాయప్ప నాగేంద్ర, చిన్న నాగముణి, రామచంద్ర, నాగలింగ, నారాయణ స్వామి, ఎర్రినాగప్ప, నగేష్, నాగప్ప, బూసి, బాలన్న, తదితరులు పాల్గొన్నారు.

నిస్సి ప్రార్థన మందిరం వార్షికోత్సవం



మాట్లాడుతున్న నందనకుమార్

గుంతకల్లు: స్థానిక ఇందిరా నంగర్‌లోని నిస్సి ప్రార్థన మందిరం మొదటి వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విజయవాడకు చెందిన ఏపీ డైరెక్టర్ బి.నందనకుమార్ హాజరై క్రీస్తు సందేశాన్ని వినిపించారు. కార్యక్రమంలో యూసీడబ్ల్యూఫ్ కార్యదర్శి సాల్మన్‌రాజు, ఐటీసీ బైబిల్ కళాశాల హెడ్ మంత్స్, ప్రార్థన మందిరం కాపరి రాజా, పావెల్, సంఘ సభ్యులు ప్రదీప్, హను, యేసు, రత్నం, ఇసాక్, విజయరావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

యాడికి: మండల కేంద్రంలోని శివలక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ సభ్యులు సోమవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 50 మంది పాల్గొని రక్త దానం చేయటం అభినందనీయని అనంతపురం డీఆర్ఓ మలోల అన్నారు. అనంతరం ఆయన రక్తదాతలకు సర్టిఫికెట్లు పంపిణీ చేసి, అభినందించారు. కార్యక్రమంలో మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ, సభ్యులు ధ్రువనారాయణ, చంద్రశేఖరరెడ్డి , రామ్మోహన్, నరసింహవా, అశోక్, శంకరప్ప, లక్ష్మీకాంతమ్మ, ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలో సీజనల్ వ్యాధుల నివారణకు మున్సిపల్ అధికారులు సోమవారం చర్యలు తీసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా ఆధ్వర్యంలో శానిటరీ సిబ్బంది మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల్లో పరిశుభ్రత పనులు చేశారు. దోమల నివారణకు మందులు పిచికారీ చేయించారు. ముఖ్యంగా దోమల ఆవాస ప్రాంతాల(నీరు నిలువ ఉన్న ప్రాంతాలు)లో మందులు పిచికారీ చేయించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషా, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

పుట్లూరు: మండల కేంద్రంలో ఈ నెల 14న జరిగిన బుడ్డన్నగారి కంబగిరి హత్య కేసులో నిందితులను సోమవారం అరెస్ట్ చేసినట్లు సీఐ సత్యబాబు తెలిపారు. ఆస్తి తగాదాలే హత్యకు కారణమని ఆయన వివరించారు. నిందితులైన మృతుడి అన్న, వదినలు బుడ్డన్న గారి కంబగిరి, గుర్రమ్మను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచామన్నారు.

ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం ప్రదక్షిణలు



కన్నీటి పర్యంతం అవుతున్న కామాక్షి

తాడిపత్రి రూరల్ ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం నెల రోజులుగా సచివాలయం, తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకునే నాథులే కరువయ్యాడని బాధితురాలు కామాక్షి ఆవేదన వ్యక్తం చేసింది. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద విలపిస్తున్న బాధితురాలు కామాక్షి సాక్షి కంటపడింది. ఈ సందర్భంగా ఆమె.ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం నెల రోజులుగా పనులు వదిలిపెట్టి పడుతున్న బాధను వ్యక్తం చేసింది. వివరాలు.. పట్టణంలోని పోరాటకాలనీకి చెందిన కామాక్షి భర్త చంద్రశేఖర్‌రెడ్డి లారీ యజమాని. అప్పుడప్పుడు లారీ డ్రైవర్‌గా వెళ్తుండేవాడు. 2025 మార్చిలో డ్రైవర్‌గా కర్ణాటకలోని చిత్రదుర్గకు వెళ్లాడు. లారీ టైర్ పంక్చర్ కావడంతో రోడ్డు పక్కన నిలిపి టైరు బయటకు తీస్తున్న సమయంలో వెనుకనుంచి వచ్చిన వాహనం ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడి చంద్రశేఖర్‌రెడ్డి మృతి చెందారు. భర్త చనిపోవడంతో ఇన్సూరెన్స్‌తో పాటు భర్త పేరు మీద ఉన్న వాటి కోసం అధికారుల వద్దకు వెళితే ఫ్యామిలీ సర్టిఫికెట్ కావాలని చెప్పడంతో గత నెలలో పోరాటకాలనీలోని సచివాయంలో కామాక్షి దరఖాస్తు చేసుకుంది. సర్టిఫికేట్ కోసం సచివాలయం చుట్టూ 20 రోజుల పాటు ప్రదక్షిణలు చేసింది. చివరికి తహసీల్దార్ కార్యాయానికి దరఖాస్తు చేరిందని తెలిసి పది రోజులుగా ఇక్కడికి వచ్చి వెళుతోంది. కార్యాలయానికి వచ్చినప్పుడల్లా ఆ అధికారి లేడని, ఈ అధికారి లేడని ప్రస్తుతం బదిలీపై తహసీల్దార్ వెళ్లారని, కొత్త తాహసీల్దార్ ఎప్పుడు వస్తాడో తెలియదని సిబ్బంది చెప్పడంతో కామాక్షి కన్నీటీ పర్యంతమైంది. ఫ్యామిలీ సర్టిఫికెట్‌పై «సాక్షి» ఆరా తీస్తే తహసీల్దార్ సంతకం అవసరముందని సిబ్బంది తెలిపారు. ఈనెల 11న తహసీల్దార్ రజాక్‌వలి బదిలీపై గుమ్మఘట్టకు వెళ్లారని, ఆయన స్థానంలో పెద్దవడుగూరు తహసీల్దార్ ఉషారాణి బాధ్యతలు తీసుకునేందుకు ఇష్టపడకపోవడంతో.. వారం రోజులుగా తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉంది. ఇన్‌ఛార్జ్‌గా డిప్యూటీ తహసీల్దార్ సోమశేఖర్‌కు బాధ్యతలు అప్పగించినప్పటికి ఎఫ్ఏసీ (ఫర్ అడిషనల్ చార్జ్) ఇవ్వకపోవడం వల్ల డిజిటర్ కీ ఇవ్వలేదని, దీంతో తహసీల్దార్ సంతకం పెట్టే అవకాశం లేకపోవడం వల్ల కామాక్షి లాంటి బాధితురాళ్లు వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షణాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.